సాక్షి పార్వతీపురం మన్యం

గురువారం | 5 | సెప్టెంబర్ | 2024

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ర్యాలీ



చీపురుపల్లిరూరల్(గరివిడి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, మాల మహానాడు ఆధ్వర్యంలో గరివిడిలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. కొండపాలెం మేజర్ పంచాయతీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం తహసీల్దార్ బంగార్రాజుకు వినతిపత్రం అందజేశారు. మాలమహానాడు గరివిడి మండలాధ్యక్షుడు టొంపల సంజీవరావు మాట్లాడుతూ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని, ఎస్సీల ఐక్యతకు భంగం కల్పించే వర్గీకరణ చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, మాలమహానాడు నాయకులు పి.చంద్రరావు, గంటాన అప్పారావు,బూర సూర్యనారాయణ, బి.పోలీసు, ఎల్.రాంబాబు, మాల మహిళా కార్యకర్తలు, మాల ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ హుండీల ఆదాయం లెక్కింపు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. గత నెల 3వ తేదీ నుంచి ఈ రోజు వరకు 30 రోజులకు హుండీల ద్వారా రూ.4,39,523ల ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ మురళీకృష్ణ తెలిపారు.
ఈ లెక్కింపులో దేవదాయశాఖ, ఏపీజీవీబీ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఆశ్రమ పాఠశాల తనిఖీ

- డిప్యూటీ వార్డెన్‌కు మెమో



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఇన్‌చార్జి పీఓ వీవీ రమణ

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ వి.వి.రమణ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిపెట్టిన భోజన మెనూ పరిశీలించారు. పెరుగు, పప్పు పల్చగా ఉండడాన్ని గుర్తించారు. పాఠశాల నిర్వహణ సరిగా లేకపోవడంతో డిప్యూటీ వార్డెన్ రామ్మోహనరావుకు మెమో జారీ చేశారు. రుచికరమైన, పోషక విలువలతో కూడిన భోజనం విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ చిన్నబాబు ఉన్నారు.

బిత్రపాడు పంట పొలాల్లో ఏనుగులు



బిత్రపాడు పంట పొలాల్లో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు, బట్లబద్ర, నిమ్మలపాడు పంట పొలాల్లో ఏనుగులు బుధవారం సంచరించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పామాయిల్ తోటలో ఉండి గుమ్మడిగెడ్డ వాగులోకి జారుకున్నాయి. సాయంత్రానికి నిమ్మలపాడు నుంచి బిత్రపాడు పరిసర ప్రాంతాల్లోకి చేరాయి. చీకటి పడిన సమయంలో గ్రామంలోకి వచ్చే అవకాశం ఉందని, అటవీశాఖ సిబ్బంది స్పందించి తరలించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

సిరులు కురిపిస్తున్న సీతాఫలం



గండపాక వద్ద సీతాఫలాల క్రయవిక్రయాలు

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ప్రాంతంలో లభించే సీతాఫలాలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. ఏటా జూలై నుంచి అక్టోబర్ నెలాఖరు వరకు రాయగడజమ్ము, మంత్రజోల, పెంగవ, గడవంకధార, బాతుగుడబ, పాములగీసాడ, బయ్యాడ, మూలబిన్నిడి, కొండబిన్నిడి, చాపరాయి బిన్నిడి, దేరువాడ, కుస, లాడ, వనకాబడి, తోట, గోరటి, ఒడ్రుబంగి, కప్పకళ్లు, దేరుగండ, వాడబాయి, వంగర, కీసరి, డోలుకోన తదితర గ్రామాల్లో విరివిగా లభించే సీతాఫలాలను కొనుగోలు చేసేందుకు మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు పోటీ పడుతుంటారు. ఈ ఏడాది కూడా గిరిజనులు పండించిన సీతాఫలాలను కావిడ రూ.600 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఇవే ధరలు సీజన్ ఆఖరువరకు ఉంటే శ్రమకు ఫలితం దక్కుతుందని గిరిజన రైతులు చెబుతున్నారు.

15 నాటికి ఇ-పంట నమోదు పూర్తి కావాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో ఇ-పంట నమోదు ఈ నెల 15 నాటికి పూర్తి కావాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో అధికారులతో బుధవారం సమీక్షించారు. వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇ-పంట నమోదు చేయాలన్నారు. డ్రోన్‌లను పెద్దఎత్తున ఉపయోగించుకోవాలన్నారు. సీసీఆర్ కార్డుదారులకు పంట రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. ఉద్యానశాఖ కింద జీడిమామిడి పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. పీఏసీఎస్ గిడ్డంగులను వినియోగించుకోవాలన్నారు. చెరువుల్లో చేపల పెంపకం చేపట్టేందుకు ఆసక్తి ఉన్న రైతులను ప్రోత్సహించాలన్నారు. పాఠశాల ఆవరణలు, చెరువుగట్లపై మొక్కలు నాటాలని అటవీశాఖను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా అటవీశాఖాధికారి జీఏపీ ప్రసూన, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మన్మథరావు పాల్గొన్నారు.

శభాష్ టీచర్





గురుబ్రహ్మ.. గురువిష్ణు అంటూ పూజించడమే కాదు.. ఆచార్యదేవోభవ అంటూ గురువులకు అగ్రపీఠం వేసిన గొప్ప సంస్కృతి మనది. విద్యార్థి భవిష్యత్తును నిర్దేశించి.. అతని ఉన్నతిని అంచనా వేసి.. అభివృద్ధి పథంలో నడిపించే చుక్కాని గురువులు. పుస్తకాల్లోని పాఠాలు మాత్రమే చెప్పేవారు సాధారణ ఉపాధ్యాయులు.. విద్యార్థుల అభిరుచిని గుర్తించి, అందుకనుగుణంగా సానపెట్టి, వారి సర్వతోముఖాభివృద్ధికి పాటుపడేవారు ఉత్తమ గురువులు. గురువు అంటే హోదా కాదు.. రేపటి పౌరులను తయారు చేసి, సమాజానికి అందించే గురుతర బాధ్యత. అలాంటి బాధ్యతను తలకెత్తుకుంటూ.. కేవలం వృత్తిలోనే కాదు, సామాజిక సేవలోనూ ముందుంటూ 'శభాష్ టీచర్' అనిపించుకుంటున్నారు కొందరు. ఇలాంటి కొంతమంది ఉపాధ్యాయులు స్ఫూర్తిదాయక ప్రస్థానంపై నేడు 'ఉపాధ్యాయ దినోత్సవం' సందర్భంగా 'సాక్షి' అక్షర రూపం.

- సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురంటౌన్/గరుగుబిల్లి/భామిని/పాలకొండ/వీరఘట్టం/సీతంపేట

"వైద్యుడు నిర్లక్ష్యం చేస్తే ఒకరి ప్రాణం పోతుంది. ఇంజినీరు అలసత్వం ప్రదర్శిస్తే ఒక కట్టడం కూలిపోతుంది. అదే ఒక ఉపాధ్యాయుడు నిర్లక్ష్యం చేస్తే ఒక తరం నాశనమవుతుంది."
- సర్వేపల్లి రాధాకృష్ణన్

"సాధారణ ఉపాధ్యాయులు పాఠం చెబుతారు. మంచి ఉపాధ్యాయులు వివరిస్తారు. ఉత్తమ గురువు ప్రేరణ కలిగిస్తారు."
- అబ్దుల్ కలాం

- ఈ గురువుల బోధన.. వినూత్నం
- విద్య, పాఠశాలల అభివృద్ధికి తమదైన తోడ్పాటు
- సామాజిక సేవలోనూ ముందంజ
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

సేవాతత్పరుడు

చిన్నారులకు ఆసక్తిగా పాఠ్యాంశ బోధన చేస్తున్నది సీతంపేట మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడు. ఒకప్పుడు ఆ పాఠశాల విద్యార్థుల సంఖ్య పదిలోపే. ఇప్పుడు 30 మంది. గ్రామంలో బడివయస్సు పిల్లలందరినీ బడికి పంపించేలా తల్లిదండ్రులను ఒప్పించారు. వారిలో అక్షర చైతన్యం కలిగించారు. పిల్లలకు కావాల్సిన అట్టలు, పెన్నులు, నోట్ పుస్తకాలు వంటివి సొంత డబ్బులతో సమకూర్చుతున్నారు. ఇప్పుడు ఆ ఊరు వెళ్తే మా మంచి మాస్టారంటూ గిరిజనులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఆయన వల్లే మా పిల్లలు చక్కగా చదువుకుంటున్నారంటూ గ్రామస్తులు గర్వంగా చెబుతున్నారు.





విద్యార్థులతో ఉపాధ్యాయుడు తిరుమలాచార్యులు

చదువుల గుడి కోసం..

తాను ఎక్కడున్నా.. విద్యార్థులే కాదు, ఆ పరిసరాలూ అభివృద్ధి చెందాలన్న ఆలోచన కొందరిలోనే ఉంటుంది. అటువంటి వారిలో జేబీ తిరుమాలాచార్యులు ఒకరు. ప్రస్తుతం పార్వతీపురంలోని జిల్లా పరిషత్ సంస్కృతోన్నత పాఠశాలలో సంస్కృత ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. గతంలో నందబలగ, సాలూరు వేద సమాజం జెడ్పీ సంస్కృతోన్నత పాఠశాలలో పనిచేశారు. దాతలు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములవుతారు. రూ.4.30 లక్షల వ్యయంతో వేదసమాజం పాఠశాలకు బాలుర మరుగుదొడ్డి, డిజిటల్ క్లాస్ రూం, కంప్యూటర్, జిరాక్స్ యంత్రం, కంచాలు, గ్లాసులు, ఫ్యానులు వంటివి సమకూర్చారు. రూ.లక్షతో ప్రస్తుతం పని చేస్తున్న పార్వతీపురం పాఠశాల అభివృద్ధిలోనూ భాగస్వామ్యమయ్యారు. 2022లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు.

నిత్య కృషీవలుడు

చిత్రంలో పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నది వీరఘట్టం మండలం చిట్టపులివలస ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సాకేటి రాంబాబు. పాఠశాలకు సెలవు పెట్టడమంటే ఈయనకు నచ్చదు. నిత్యం విద్యార్థులను అన్నిరంగాల్లో విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన బోధన అందిస్తారు. అందుకే ఆయనను 365 రోజులు పనిచేసే మాస్టారుగా ఈ ప్రాంతీయులు పిలుస్తారు. ఆయన ఏ పాఠశాలలో పనిచేసినా అక్కడి పిల్లలు జవహర్‌నవోదయ, ఏపీ గురుకుల ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చూపుతారు. ఆయన 2011లో మండల, 2012లో జిల్లా, 2023లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా సత్కారం అందుకున్నారు.



బహుముఖ ప్రజ్ఞాశాలి



ఈ చిత్రంలో విద్యార్థులకు పాఠ్యాంశబోధనలో నిమగ్నమైనది బౌరోతు శంకరరావు. పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితునిగా పనిచేస్తున్నారు. విద్యార్థుల్లో భాషాజ్ఞానంతో పాటు, కళలను ప్రోత్సహిస్తున్నారు. పేద విద్యార్థుల చదువుకు అండగా నిలుస్తున్నారు. సన్మాన పత్ర రచయితగా రాష్ట్రంలో ఎంతో గుర్తింపు సాధించారు. సత్యహరిశ్చంద్రగా, రచయితగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన జ్ఞానాన్ని నిరంతరం విద్యార్థులకు పంచుతున్నారు.

బోధనే.. ఒక ప్రయోగం



పార్వతీపురం జెడ్పీ సంస్కృత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేస్తున్న ఉత్తరవల్లి గోవిందరావునాయుడు.. తన 25 ఏళ్ల సర్వీసులో వినూత్నమైన పద్ధతిలో బోధనతోపాటు.. పిల్లలతో ప్రయోగాలు, క్షేత్రస్థాయి పర్యటనలు, ప్రాజెక్టులు చేయిస్తూ వారిని జిల్లా, రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్, సైన్స్ కాంగ్రెస్, ఇన్‌స్పైర్ అవార్డుల పోటీలకు సంసిద్ధులను చేస్తున్నారు. ఎన్‌ఎంఎంఎస్, ఎన్‌టీఎస్‌సీ, పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ తదితర పరీక్షలకు, ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీ, ఐఐటీ, వైద్య కళాశాలల్లో ప్రవేశ పరీక్షలకు పోటీ పడేలా తగిన మార్గనిర్దేశం చేస్తున్నారు. పలువురు పేద విద్యార్థులకు ఫీజులు, పుస్తకాలు వంటివి సమకూరుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన వద్ద చదివిన ఎంతో మంది విద్యార్థులు నేడు వైద్యులుగా, ఇంజినీర్లుగా స్థిరపడ్డారు. మూఢనమ్మకాలు వంటివాటిపై ప్రజలను చైతన్యం చేస్తున్నారు. వృత్తిలో ఈయన చేస్తున్న సేవలకు పలు అవార్డులూ వరించాయి.

గురువుగా కాదు.. విద్యార్థుల్లో ఒకరిగా!



గరుగుబిల్లి మండలం దళాయివలస ప్రాథమికోన్నత పాఠశాల టీచర్ వై.శంకరరావు. చక్కని హాస్యం జోడించి.. ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లల్లో ఒకరిగా కలిసిపోయి వినూత్నమైన పద్ధతిలో పాఠాలు చెప్పడం ఆయన ప్రత్యేకం. గణితాన్ని సులభంగా అర్థమయ్యేలా వేదిక్ మ్యాథ్‌లు ద్వారా బోధిస్తుంటారు. మానసిక వికాసానికి యోగా నేర్పుతారు. సాహిత్యపరంగా సృజనాత్మకతను జోడించి గేయరూపంలో, కథల రూపంలో పాఠాలు చెబుతుంటారు. పిల్లల్లో విలువలు నేర్పేలా నాటకాలు వేయిస్తూ ప్రోత్సహిస్తున్నారు. పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు తన సొంత ఖర్చుతో అందిస్తారు. తాను పని చేసిన పాఠశాలను ప్రత్యేకంగా సొంత ఖర్చులతో అభివృద్ధి చేస్తుంటారు. పాంద్రంకి పాఠశాలకు ఇనుపగేటును, పులిగుమ్మి విద్యాలయానికి బోరింగును ఏర్పాటు చేశారు. హిక్కింవలస పాఠశాలకు గోడలపై బోధనకు ఉపయోగపడే చిత్రాలను వేయించారు. సరస్వతీ దేవి, మహాత్మా గాంధీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. బోధనే కాక.. బడితోట వంటివి నిర్వహిస్తూ పిల్లల్లో చైతన్యం తీసుకొస్తున్నారు. 'పేదరికంలో పుట్టాను. చదువుకు ఎన్నో ఇబ్బందులు పడ్డాను. అందుకే పేదవారి విద్యోన్నతికి నావంతు తోడ్పాటును అందిస్తున్నాను.' అని చెబుతున్నారు శంకరరావు మాస్టారు. ఆయనకు ఇప్పటి వరకు 40కిపైగా వివిధ సంస్థల నుంచి అవార్డులు వచ్చాయి. 2003లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందారు. 2014లో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు.

అక్షరాలే విగ్రహాలుగా ఆదివాసీల ఆరాధన



ఆలయం, సవరలిపి అక్షర రూపాలు


కంటికి కనిపించే వారినే గురువులనుకుంటాం. తనకు విలువిద్యను అభ్యసించేందుకు నిరాకరించిన ద్రోణాచార్యుడి విగ్రహాన్ని బంకమట్టితో ప్రతిష్ఠించుకుని స్వఅధ్యయనం చేశాడు ఏకలవ్యుడు. చివరికి గురువు అడిగాడని తన కుడిచేతి బొటనవేలినే గురుదక్షిణగా సమర్పించాడు. అక్షరాలను విగ్రహాలుగా మలిచి, అక్షర బ్రహ్మ ఆలయంలో ప్రతిష్ఠించి ఆదివాసీలు పూజలు చేస్తున్న అరుదైన విధానం మన దగ్గరే ఉంది. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో సవర తెగకు చెందిన ఆదివాసీలు తాము మాట్లాడే మాతృభాష సవరభాషకు లిపిని కనుగొన్న మంగయ్య గుమంగో విగ్రహాలు పెట్టి ఆరాధిస్తున్నారు. 24 సవర లిపి అక్షరాలనే విగ్రహాలుగా చేసి ఆలయంలో ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. భామిని మండలం మానుమకొండలో అక్షర బ్రహ్మ ఆలయం ఉంది.

గిరిజన అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ

- పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురంల్లో నిర్వహణకు సన్నాహాలు

సాక్షి, పార్వతీపురం మన్యం: డీఎడ్, బీఈడీ పూర్తిచేసి టెట్ ఉత్తీర్ణులైన గిరిజన అభ్యర్థులకు డీఎస్సీ రాత పరీక్షకు ఉచిత శిక్షణ అందించేందుకు ఐటీడీఏ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురంల్లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో కేంద్రంలో వంద మందికి శిక్షణ ఇస్తారు. ఇప్పటికే దీనికి సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ఐటీడీఏకు 220, డీఈఓ వద్ద మరో 105 వరకు దరఖాస్తులు వచ్చాయి. శిక్షణ కాలపరిమితి మూడు నెలలు కాగా.. అభ్యర్థుల అవసరం, ఆసక్తిని బట్టి వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు తెలుస్తోంది. నిపుణులైన వారితో బోధన, స్టడీ మెటీరియల్‌ను ఉచితంగాఅందించనున్నారు.

ఎస్టీలకు ప్రాధాన్యం



ఈ నెల 9వ తేదీ తర్వాత జిల్లాలో రెండు డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రాలను ప్రారంభిస్తాం. తొలుత గిరిజన అభ్యర్థులకే ప్రాధాన్యమిస్తాం. ఇంకా అవకాశం ఉంటే.. గిరిజనేతర అభ్యర్థులనూ తీసుకుంటాం. ఇప్పటికే చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా అభ్యర్థులు మిగిలి ఉంటే.. కలెక్టర్ ఆదేశాలతో మరో కేంద్రం ఏర్పాటు చేస్తాం.

– ఎం.రుక్మాంగదయ్య, ఉప సంచాలకులు, గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏ, పార్వతీపురం

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

- జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు మేనేజర్ గౌరి



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు మేనేజర్ కె.గౌరి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి కళాశాల నుంచి జొన్నగుడ్డి వరకు బుధవారం హెచ్‌ఐవీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఐవీ రోగులపై వివక్ష చూపకూడదని తెలిపారు. హెచ్‌ఐవీ సోకిన వారు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ఏఆర్‌టీ కేంద్రంలో ఇచ్చే మందులు వాడి మంచి పౌష్టికాహారం తీసుకుంటే జీవితకాలాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.సుధ, డి.అప్పారావు, వై.శ్రీనివాసరావు, కె. వెంకటరమణ, ఎం.కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత రహిత జిల్లాగా మార్చుదాం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలి
- చిన్నారులకు రోటా వైరస్ టీకా వేసిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



వీరఘట్టంలో ఓ చిన్నారికి రోటా వైరస్ వ్యాక్సిన్ వేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లాను రక్తహీనత రహిత జిల్లాగా మార్చుదామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులు ప్రతినెలా వైద్యసేవలు సక్రమంగా అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయపార్వతికి సూచించారు. అనంతరం పలువురు చిన్నారులకు అన్నప్రాసన చేస్తూ పౌష్టికాహారాన్ని తినిపించారు. చిన్నారుల్లో డయేరియా నివారణ కోసం రోటా వైరస్ వ్యాక్సిన్‌ను వేశారు. సామూహిక సీమంతాల కార్యక్రమంలో గర్భిణులకు పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు అందజేశారు. పండంటి శిశువులకు జన్మనివ్వాలని ఆశీర్వదించారు. ప్రతి గర్భిణీ ప్రభుత్వాస్పత్రిలో ప్రసవించేలా వైద్యాధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్, ఐసీడీఎస్ పీడీ ఎం.ఎల్.రాణి, వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు యూనిట్ పరిశీలన

వీరఘట్టంలో ఉన్న వర్మీ కంపోస్టు సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. దీనిని మోడల్ కేంద్రంగా మార్చాలని నిర్వాహకులకు సూచించారు. జిల్లాలో 138 వర్మీకంపోస్టు యూనిట్లు ఉన్నాయని, వీటిలో చాలా యూనిట్లు వాడుకలో లేవని, వాటన్నింటినీ అక్టోబర్ 2 నాటికి వాడుకలోకి తీసుకురావాలని జిల్లా ఇన్‌చార్జి గ్రామ పంచాయతీ అధికారి వై.సత్యంనాయుడుకు సూచించారు. వర్మీకంపోస్టును రైతులు కొనుగోలు చేసేలా వ్యవసాయశాఖ అవగాహన కల్పించాలని ఏఓ సౌజన్యకు సూచించారు.